

సోనాలలో పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## అధికారులు రైతులకు సహకరించాలి

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

బోథ్, నవంబర్ 7 : పత్తి విక్రయించడానికి వచ్చే రైతులకు అధికారులు పూర్తి సహకారం అందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం సోనాలలోని గురు సాహెబ్ చందా జిన్నింగ్ మిల్లులో సీసీఐ ద్వారా చేపడుతున్న పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో తేమ శాతం కొంచెం ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ సదానందం, జిన్నింగ్ మిల్లు యజమాని గులాబ్ సింగ్ పాల్గొన్నారు.



## కుర్చీలు ఖాళీ

బజార్‌హత్నూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

**సమయపాలన పాటించని ఎంపీడీవో సిబ్బంది**

**బజార్‌హత్నూర్ ఎంపీడీవో** కార్యాలయ సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. గురువారం ఉదయం 11 గంటలు దాటినా సిబ్బంది విధులకు రాలేదు. దీంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. జూనియర్ అసిస్టెంట్ సెలవులో ఉండడంతో సూపరింటెండెంట్ ముత్యంరావు, సీనియర్ అసిస్టెంట్ కాంచనమాల ఆఫీసుకు రాలేదు. సమగ్ర కుటుంబ సర్వే గోడ ప్రతులు సీనియర్ అసిస్టెంట్ కాంచనమాలకు చెందిన బీరువాలో ఉండడంతో అధికారుల రాక కోసం పంచాయతీ కార్యదర్శులు కార్యాలయం వద్ద పడిగాపులు కాశారు. ఈ విషయమై ఎంపీడీవో శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. సమయపాలన పాటించని అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. *- బజార్‌హత్నూర్, నవంబర్ 7*



కలెక్టరేట్ ఎదుట చేపట్టిన మహాదీక్షలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు

## కాంగ్రెస్ మొద్దు నిద్ర

- పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి..
- లేకపోతే 20వ తేదీ తర్వాత సమ్మె చేస్తాం..
- ప్రభుత్వానికి సీఐటీయూ నాయకుల హెచ్చరిక

ఎదులాపురం, నవంబర్ 7 : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా పని చేస్తున్న 1200 మంది గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదని, ఇది వదలకపోతే ఈనెల 20వ తేదీ తర్వాత సమ్మెలోకి వెళ్తామని పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ ఆశన్న ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ఒక రోజు మహాదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆశన్న మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు నిరవధిక సమ్మె సందర్భంగా ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని మండిపడ్డారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్, గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గంగన్న, దుబాక రమక్క, నర్సమ్మ టి.గంగన్న, జిల్లా నాయకులు వాగారావ్, రఫీ, గంగయ్య, దేవుసింగ్, రాజు, వీలాష్, ప్రకాశ్, సంతోష్, సూర్య పాల్గొన్నారు.



శ్రీనివాస్ జిన్నింగ్ మిల్‌కు తీసుకొచ్చిన పత్తి తేమను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

## సజావుగా పత్తి కొనుగోళ్లు

- రైతులు సీసీఐకే విక్రయించాలి
- కౌలు రైతులకు కల్టివేషన్ సర్టిఫికేషన్ ఇస్తున్నాం
- అమ్మకానికి రక్త సంబంధీకులు వచ్చినా సరిపోతుంది..
- కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, నవంబర్ 7 : వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగుతోందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం మార్కెట్ యార్డులో కొనుగోళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. సిబ్బందితో మాట్లాడి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు పత్తిని సీసీఐకి మాత్రమే విక్రయించాలని, ఇంకా సమయం ఉందని పత్తిని ఆరబెట్టుకుని తీసుకురావాలని సూచించారు. పట్టాపాస్ బుక్ పుస్తకాలు లేని కౌలు రైతుల కోసం కల్టివేషన్ సర్టిఫికేషన్‌ను మండలాల్లో వ్యవసాయ శాఖ అధికారి, ఆర్ఐ సంతకాలు చేసి సర్టిఫికెట్ ఇస్తారని తెలిపారు. వాటిని తీసుకుని పత్తిని విక్రయించాలన్నారు. పత్తి విక్రయానికి పట్టాదారు రావాల్సిన అవసరం లేదని, రక్త సంబంధీకులు వచ్చిన సరిపోతుందన్నారు. అనంతరం శ్రీనివాస జిన్నింగ్ మిల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట మార్కెటింగ్ ఏడీ గజానంద్, కార్యదర్శి మధుకర్ ఉన్నారు.

## ముమ్మర తనిఖీలు చేపట్టాలి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ

బోథ్, నవంబర్ 7 : మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద ముమ్మర తనిఖీలు చేపట్టాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. గురువారం సాయంత్రం బోథ్ మండలంలోని ఘన్‌పూర్ అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేశారు. వాహనాల తనిఖీ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రభావితం చేయడానికి డబ్బు, మద్యం, ఇతర బహుమతి వస్తువులు రవాణా కాకుండా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. వచ్చి- పోయే వాహనాల వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఎస్పీ వెంట బోథ్ సీఐ రమేశ్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

## యువతి మృతిపై విచారణ



సెయింట్ థామస్ స్కూల్‌లో వివరాలను తెలుసుకుంటున్న ఉన్నతాధికారులు

బోథ్, నవంబర్ 7 : పొచ్చెర క్రాస్ రోడ్డు వద్ద గల సెయింట్ థామస్ పాఠశాలకు చెందిన యువతి ఫూల్ ఖాలీ బైగా ఇటీవల ఫుడ్ పాయిజన్‌తో మృతి చెందింది. గురువారం అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్, ఫుడ్ అండ్ ఫేస్టీ మల్టీ జోన్ అధికారి తరియ నాయక్, జిల్లా ఫుడ్ అండ్ సెఫ్టీ అధికారి శ్రీధర్‌లు విచారణ చేపట్టారు. మొదటగా బోథ్‌లోని సీహెచ్‌సీకి వెళ్లి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చారా? లేదా? అని ఆరా తీశారు. అనంతరం సెయింట్ థామస్ పాఠశాలకు వెళ్లి ఘటన వివరాలు సేకరించారు. అస్వస్థతకు గురైన ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోవడంతో సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటన నివేదికను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు వారు పేర్కొన్నారు.



ఆదిలాబాద్ జిల్లా మావల మండలం బట్టి సవర్గాంతో ఓ రైతు చేనులో విరగబూసిన పత్తి

### కూలీల సమస్య బాగా ఉంది..



నాకు మావల మండలంలోని బట్టిసావర్గాం శివారులో నాలు గెకరాల భూమి ఉంది. ఇందులో పత్తి సాగు చేశా. వారం రోజుల నుంచి పత్తి తీద్దామనుకుంటే కూలీలు దొరుకుతలేరు. దీంతో ఆదిలాబాద్ నుంచి కూలీలను పత్తి తీయడానికి తీసుకొచ్చా. ఆటో కిరాయితోపాటు కిలోకు రూ.10 చొప్పున చెల్లిస్తున్నా. గతేడాది రూ.7 నుంచి రూ.8 వరకు చెల్లించే వాళ్లం.

**- భూమారెడ్డి, రైతు**

# చేలలోనే పత్తి

- రైతులను వేధిస్తున్న కూలీల కొరత
- గతేడాది కిలోకు రూ.7.. ఈ యేడాది రూ.10..



ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి వాహనం లేక ఖాళీగా ఉన్న కాంటా



పత్తి ఏరుతున్న కూలీలు

ఆదిలాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ) : జిల్లావ్యాప్తంగా పత్తి పంట దిగుబడి ఆశాజనకంగా ఉన్నా.. కూలీల కొరత ప్రధాన సమస్యగా మారింది. వానకాలంలో 4.13 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. వాతావరణ పరిస్థితులు, వర్షాలు సాగుకు సహకరించడం, పంట లో తెగుళ్లు, చీడ పురుగుల నివారణలో రైతులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడంతో దిగుబడి బాగా వస్తున్నది. ఎకరాకు 10 క్వింటాళ్ల పత్తి చేతికొస్తుందని రైతులు అంటున్నారు. రైతులు అక్టోబర్ మొదటి వారం నుంచి పత్తిని తీస్తూ ఇండ్ల వద్ద నిల్వ ఉంచుతున్నారు. అక్టోబర్ 25వ తేదీన కొనుగోళ్లు పారంభం కాగా.. రోజు పది క్వింటాళ్ల పత్తి ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు వస్తున్నది. తేమ శాతం అధికంగా ఉండడంతో పత్తిని ఎండబెట్టి విక్రయానికి తీసుకొస్తున్నారు. తక్కువ సం ఖ్యలో పత్తి వస్తుండడంతో మార్కెట్ యార్డులో కాంటాలు ఖాళీగా కనిపిస్తున్నాయి.

### కూలీల కొరత

పంట చేతికొచ్చి పక్షం రోజులు గడుస్తున్నా.. పంటను తీయడానికి కూలీల కొరత వేధిస్తున్నది. రైతులందరూ ఒకేసారి పత్తి తీయాల్సి రావడంతో కూలీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో వారికి రోజువారీ కూలీ కాకుండా కిలోల చొప్పున చెల్లించాల్సి వస్తున్నది. కిలో పత్తి తీస్తే రూ.10 చొప్పున రైతులు చెల్లిస్తున్నారు. ఒక్కో కూలీ రోజు 60 కిలోల వరకు పత్తి తీస్తుండగా.. దీంతో వారికి రూ.600 వరకు గిట్టుబాటు అవుతుందని రైతులు అంటున్నారు. పత్తి తీసేవారిని ఆదిలాబాద్ పట్టణంలోని వివిధ ప్రాంతాలతో పాటు మండల కేంద్రాల నుంచి ఆటోలో తీసుకొస్తున్నామని, ఆటో కిరాయి కూడా తామే భరించాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందు తున్నారు. జిల్లాలోని తాంసి, తలమడుగు, భీంపూర్, జైనథ్, బేల మండలాల్లో పలు గ్రామాల్లో రైతులు మహారాష్ట్ర నుంచి కూలీలను తీసుకొస్తున్నారు.

## వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, నవంబర్ 7 : పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేలా విద్యాశాఖ కృషి చేస్తున్నదని, ఇందులో భాగంగానే వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ తీసుకుంటున్నారని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం పట్టణంలోని బాలక్ మందిర్ స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌లో భాగంగా ఆంగ్ల ఉపాధ్యాయులకు బోధనపై సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఏ విధంగా పాఠాలు బోధించాలో ట్రెయినర్లు వివరించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు వచ్చే నాలుగు నెలలు చాలా కీలకం అన్నారు. వెనుకబడిన విద్యార్థులకు నవంబర్, డిసెంబర్‌లలో ప్రత్యేక తరగతులు నిర్వహించేలా ప్రణాళికలు చేశామన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులను నిత్యం పాఠశాలకు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో ప్రణీత, హెచ్ఎం ఉర్స నిఖత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అందరిని ఐక్యం చేయడమే స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్దేశం

అందరిని ఐక్యం చేయడమే స్కౌట్స్ అండ్ గైడ్స్ ముఖ్య ఉద్దేశమని కలెక్టర్, స్కౌట్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు రాజర్షి షా అన్నారు. గురువారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ 75వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాదాస్ నగర్‌లో గల స్కౌట్స్ స్థలంలో కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జెండాను ఆవిష్కరించి ప్రార్థన చేశారు. ఇందులో భాగంగానే ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా రాజర్షి షా మాట్లాడుతూ.. అసమానత్వం లేని సమాజ స్థాపన కోసం స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను స్థాపించడం జరిగిందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లిని పురస్కరించుకుని డీఈవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. డీఈవో ప్రణీత జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, స్కౌట్స్ ఉపాధ్యక్షుడు కాంచనవల్లి రత్నాకర్, కోశాధికారి కన్నం మోహన్ బాబు, గుండి మహేశ్, మహేశ్, శాస్త్రీ, సంయుక్త కార్యదర్శి జి.లక్ష్మీ, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- కిలో అధికంగా జోకిన చర్యలు తీసుకుంటాం..
- కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములకు తరలించాలి..
- కలెక్టర్ అభిలాష అభినవ్

లక్ష్మణచాంద, నవంబర్ 7 : కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇక్కట్లు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. గురువారం పీచరలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడారు. తాలు పేరిట కిలో ధాన్యం అధికంగా జోకిన నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో తాలు, తప్ప తొలగించే యంత్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన పత్రాన్ని రైతులకు అందజేయాలని అధికారులకు సూచించారు. రైతులు ఇబ్బంది అయితే సహాయ కేంద్రానికి ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములకు తరలించడానికి చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లయ్ అధికారులను ఆదేశించారు. అనంతరం పీచరలో సర్వేను, ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసారు. పొట్టపెల్లి(కే) గ్రామంలోని గోదాంను పరిశీలించారు. ఆమె వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, తహసీల్దార్ జానకీ, ఎంపీడీవో రాధిక, తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

## మా గోస పగోడికి కూడా రావొద్దు..

- ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని తీసుకెళ్తే మళ్లీ కాలిపోయిందే ఇచ్చారు..
- విద్యుత్ శాఖ అధికారులకు చెబితే వారం రోజులుగా పట్టించుకుంట లేరు..
- రూ.5,500 ఖర్చయినా ఫలితం శూన్యం.. తడిలేక ఎండుతున్న మక్క పంట
- విద్యుత్ శాఖ అధికారులను అడిగితే నిర్లక్ష్యపు సమాధానమే..
- తమ ఆవేదనను వెల్లబోసుకున్న మూడు గ్రామాల రైతులు



చేనులో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

లక్ష్మణచాంద, నవంబర్ 7 : పీచర గ్రామానికి చెందిన గుర్రం బొర్రన్న, పొట్టపెల్లి(బి) గ్రామానికి చెందిన రామనవార్ హన్మండ్లు, పార్‌పెల్లి గ్రామానికి చెందిన జుంగాల అశోక్, పీచర గ్రామానికి చెందిన గుర్రం చిన్నయ్య భూములకు విద్యుత్ సరఫరా చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ గత శుక్రవారం కాలిపోయింది. కాగా.. విద్యుత్ పీచర సబ్‌స్టేషన్‌లోని ధర్మారం ఫీడర్ ద్వారా పంపిణీ అవుతున్నది. వారం రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయకపోవడంతో రైతులు విద్యుత్ శాఖ సిబ్బందిని సంప్రదించినా స్పందించలేదు. విద్యుత్ మరమ్మతు చేసే ఓ ప్రైవేటు వ్యక్తిని సంప్రదించగా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినట్లు ధ్రువీకరించాడు. లైన్ ఇన్‌స్పెక్టర్ నారాయణ సింగ్, ఏఈ మహేశ్‌ను సంప్రదించినా ఫలితం లేకపోవడంతో రైతులు ట్రాక్టర్‌లో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయానికి బుధవారం తీసుకెళ్లారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో తిరిగి విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇచ్చారు. రూ.2,500 ఖర్చుతో తీసుకొచ్చి బిగించగా అది కూడా కాలిపోయింది ఇచ్చారని, మా గోస పగోడికి కూడా రావొద్దని రైతులు మండిపడ్డారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆందోళన చెందుతున్నారు.



పనిచేయని ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్‌పోల్‌కు అమర్చిన సిబ్బంది

### రూ. 5,500 ఖర్చయిన ఫలితం లేదు..



*గత శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపో యింది. ఎన్నిసార్లు విద్యుత్‌శాఖ అధికారులను సంప్రదించినా ఫలితం లేదు. దీంతో రూ.2,500లు పెట్టి ధర్మారంలోని ఓ ప్రైవేటు వ్యక్తికి ఇచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌ను తీయించినం. తిరిగి బిగించినం. నిర్మల్‌కు తరలించడానికి ట్రాక్టర్‌కు రూ.2,500, నిర్మల్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చిన సిబ్బందికి రూ.500 ఇచ్చినం. ఇంత ఖర్చు చేసినా ఫలితం లేదు. వేసిన మక్క మొలుకలు ఎండిపోతున్నాయి. ఒక్క విద్యుత్ శాఖ ఏఈ మహేశ్, లైన్ ఇన్‌స్పెక్టర్ నారాయణ సింగ్ రావడం లేదు. ఏంచేయాలో తెలియడం లేదు.*

**- రామనవార్ హన్మండ్లు, పొట్టపెల్లి(బి), లక్ష్మణచాంద మండలం.**

### ఎటువంటి ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చారో తెలియదు

*ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని రైతు లు తెలుపడంతో నిర్మల్‌కు తీసుకెళ్లమ ని చెప్పాను. రైతులు మరో ట్రాన్స్‌ఫా ర్మర్ తెచ్చుకున్నారు. అది కూడా పని చేయడం లేదన్నారు. అది ఎందుకు పనిచేయడం లేదో నాకు తెలియదు. విచారించి తెలుసుకుంటా.* **- మహేశ్, విద్యుత్‌శాఖ ఏఈ, లక్ష్మణచాంద.**